# నేను

ఉగాది పండగ అనగానే మనసు ఆనందంతో గంతులు వేస్తుంది.

పాత జ్ఞాపకాలన్నీ తోసుకువస్తాయి స్మృతిపథంలోకి.

ఒకదాన్ని మించిన జ్ఞాపకం మరొకటి.

ఇలాంటివి ఎన్ని ఉగాదులు ఆహ్లాదంగా గడిచి పోయాయి!

* * * * *

ముందు కనిపిస్తోందే పెద్ద మేడ – అక్కడ ఉండే కుటుంబాన్ని ఆశ్రయించుకు బ్రతుకుతున్నది మా కుటుంబం.

అలా అనడం మర్యాదకాని నిజానికి మా కుటుంబాన్నే ఆశ్రయించుకున్నది ఆ కుటుంబం.

ఇంకా చెప్పాలంటే ఇందులో ఆశ్రయింపుకన్నా ఆత్మీయత ఎక్కువ.

కొన్ని తరాలుగా స్నేహశీలత పెనవేసుకున్న కుటుంబాలు మావి.

వాళ్ళింట్లో జరిగే ప్రతిపండగా మాకు పండగే.

మేం పొందే ప్రతి ఆనందం, ప్రతిఫలం వారిదే!

ఉగాది వచ్చిందంటే – ఉగాది అన్న మాటేమిటి? – ఏ పండగ వచ్చినా ఆ యిల్లంతా హడావుడిగా ఉంటుంది. వాళ్ళని చూస్తూ, వాళ్ళతో కలిసి ఆడుకొంటూ మేమూ అలాగే ఉంటాం.

పచ్చగా పదికాలాలూ కళకళలాడే కుటుంబమది.

మూడు పువ్వులూ, ఆరుకాయలుగా సాగిపోయే కుటుంబం మాది.

నలుగురికీ లేని ప్రత్యేకతలు మాకు ఉన్నాయి ఆ యింట్లో. ఇన్నితరాల సఖ్యతలో – ఆయింట్లో వాళ్ళంతా ఎవరికి వాళ్ళు వచ్చి పెద్దదిక్కులాగ మా అమ్మతో తమ కష్టాలు వెళ్ళబోసుకొంటూంటారు. ఒక్కసారి ఆమెదగ్గర కూచొని మనస్సు తేలికచేసుకుని వెళ్తారు. వేడి సమస్యలతో సెగలు కక్కుతూ వచ్చి చల్లగా ప్రశాంతులయి వెళ్తారు. మా అమ్మ నీడలో మా మనసూ చల్లనే.

తీరికవేళల్లో ఆ కుటుంబ చరిత్ర కథలు కథలుగా చెప్పుంది మా అమ్మ. ఇప్పుడు ఆ యింటి యజమాని తిరుమలరావుగారు ఒకప్పుడు తన ఒడిలోనే ఆడుకునేవారట! ఎంత అల్లరి చేసేవారని? ఎప్పుడు వచ్చేవాడో, ఎక్కడ దాగొనేవాడో – యిల్లంతా వెదికినా కనిపించేవాడు కాదు. ఇంటిల్లిపాదీ వచ్చేవారట – మా 'చిన్నా' ఏడీ అంటూ. అక్కడి నుంచీ అతనికోసం అంతా వెదకడమే. అంత పెద్దయింట్లో ఎక్కడో దాగొనేవాడు. దొరికిపోయాక వాళ్ళనాన్నగారు నవ్వుతూ ఎత్తుకొని ముద్దాడి "దొంగా! మమ్మల్ని ఎలా తప్పించుకోవాలో నీకు బాగా తెల్సే! ఉండు. నీ చేత దొంగల్ని పట్టుకునే ఉద్యోగమే చేయిస్తాను" అనేవారట! అలాగే తిరుమలరావుగారు సర్కిల్ అయారు. ఆనాటి చిన్నబాబు యివాళ మా అందరికీ పెదబాబు అయ్యారు. అంత పెద్ద ఉద్యోగా? ఏమీ గర్వంలేదు. బయట ప్రపంచానికే ఆయన సర్కిల్. మాకు పెదబాబు. రోజూ సాయంకాలం ఒక్కసారయినా మమ్మల్ని పలకరించకుండా వెళ్ళరాయన యిప్పటికీ.

ఇక ఆయన కూతురు రాధమ్మ సంగతి నాకే తెలుసు. చిన్నప్పుడు పచ్చగా, బొద్దుగా, బంతిపువ్వులాగ ఉండేది. ఇప్పుడక్కడ ఆడుకొంటున్న పిల్లలంతా కలిసి రాధమ్మ ఆరోగ్యాన్ని అలా తయారు చేశారు. అయినా యిప్పుడున్న నాజూకుతనంలోనూ కుందనపు బొమ్మ రాధమ్మ. అటువేపు వసారాలో పళ్లు తోముకుంటూ రాధమ్మవేపు వోరచూపులు చూసే అబ్బాయి బాబ్జీ నాకు బాగా తెలుసు. ఇప్పుడా? అతను స్కూల్లో చదువుకొంటున్నప్పటి నుంచీ తెలుసు. వాళ్ళిద్దరికీ తప్పక పెళ్ళవుతుందని ఆ రోజుల్లోనే కనిపెట్టేశాను. వాళ్ళింటికి మా యిల్లు కొంచెం ఎడంగా ఉంటుంది. మేమంతా చిన్నపిల్లలం. పెరడంతా విశాలంగా, చల్లగా ఉంటుంది. అందుకని ఎప్పుడేనా రాధమ్మా బాబ్జీ అక్కడ కబుర్లు చెప్పుకొనేవారు. వాళ్ల చిరునవ్వుల్లో, మాటల్లో – బాబ్జీ రాధమ్మని చూసే చూపుల్లో, రాధమ్మ చెక్కిళ్ళలో కనిపించే సిగ్గులో కథంతా నా కర్థమయేది.

ఓసారి – పరీక్షలయిపోతున్నాయి. అవగానే అమ్మ రమ్మని ఉత్తరం వ్రాస్తోంది. "మనం పెళ్ళి చేసుకోవాలనుకొంటున్నామని మావయ్యతో చెప్పేయ్" అని రాధమ్మని బెదిరిస్తున్నాడు బాబ్జీ.

రాధమ్మ భయపడుతోంది. "అమ్మో! నాన్నకి కోపం వస్తే తుపాకీ పెట్టి

కాల్చేస్తారు. నువ్వంటే ప్రేమేగా? నువ్వు చెప్పకూడదా ఏమిటి?" అంది మెల్లమెల్లగా.

"నేను మగాణ్ణి. మీ అమ్మాయిని చేసుకొంటానని నేను చెప్తే బాగుండదు."

"నలుగురూ అనుకొనేదేగా! నువ్వు చేసుకొంటావని నాన్నకి మాత్రం తెలియదా ఏమిటి? – నువ్వే చెప్పు బాబూ" అంది రాధ.

ఎవరు చెప్పాలన్న విషయం మీద వాళ్ళిద్దరూ పది నిముషాలు తర్జనభర్జనలు చేసి, తగాదాలు పడి బుంగమూతి పెట్టుకొని యిద్దరూ విడిపోయారు.

నాకు ఒకటే నవ్వు.

ఆ ముందురోజే పెదబాబుగారూ, అమ్మగారూ యిక్కడే కూచొని మాట్లాడుతూ ఇక ఈ సెలవలో యిద్దరికీ పెళ్లి చేసెయ్యాలనుకోవడం విన్నాను.

అంతే, అనుకొన్నట్లుగానే ఆ వేసవిలోనే పెళ్ళయి పోయింది. అప్పుడు మా హడావుడి ఏమని చెప్పను. మా కుటుంబం కుటుంబమంతా ఆ నాలుగురోజులుగా వాళ్ళింట్లోనే ఉంది. తలుచుకొంటే యింకా నిన్న జరిగినట్టుంటుంది. రాధమ్మని యివాళ చూస్తే ఆశ్చర్య మేస్తుంది. మొన్నటిదాకా మాతో ఆడుకునే రాధమ్మేనా ఇంత ఆరిందా అయిపోయిందని. "త్వరగా పరుగెత్తకండర్రా పడతారు" అని పిల్లలతోనే అరిస్తే – తన చిన్నతనంలో ఎన్నిసార్లు పడేదో గుర్తుకొచ్చి నాకు నవ్వొస్తుంది. ఉన్నచోట నిలబడేదా? ఇప్పుడు కడుపు నిండా పిల్లలు. ఏ వయస్సు కదే అందం. అంతమంది పిల్లల్తో, అదిగో యింకా అక్కడే నిలబడి ముసిముసినవ్వులు నవ్వుతున్నాడే – ఆయన సరసన నిలబడితే అచ్చం పార్వతీదేవిలాగే ఉంటుంది.

సరే. పెద్దబ్బాయి రాజశేఖరం కథ చెప్పనే అక్కరలేదు. అసలు పుట్టడంతోటే చేతిలో పుస్తకంతో పుట్టాడేమోననిపిస్తుంది. ఎప్పుడూ నెమ్మది. ఎక్కువ మాట్లాడడు. ఈ భూమి మీద పడ్డ రోజున కూడా ఎక్కువ ఏడవలేదట. చాలా సేపటివరకూ పుట్టినట్టే ఎవరికీ తెలీదు. శేఖరం బాబు పుస్తకాల పురుగు. అందరం ఆటపాటల్లో మునిగి తేలుతున్నా అతను పుస్తకం వదిలేవాడు కాదు. మా అందర్లోకీ పెద్ద అతనే. ఎంత చదువు చదివాడో మా కెవ్వరికీ తెలీదు. ఆ మాటకొస్తే పెదబాబుగారికే తెలీదనుకొంటాను. వయస్సు ముప్పై దాటవు, అప్పుడే ఏవేవో దేశాలు తిరిగి వచ్చాడు. చూడ్డానికి దొరబాబులాగ ఉంటాడు. ఒకసారి – ఏ దేశమో వెళ్ళి వచ్చాక పెదబాబుగారు – యిక్కడికే, యిటువేపే తీసుకొచ్చారు. ఆ మాటా యీ మాటా చెప్పి పెళ్లి విషయం కదిపారు. సమాధానం చెప్పడు. చిరునవ్వు నవ్వి ఊరుకొన్నాడు. ఎంత చక్కగా నవ్వుతాడని? మా శేఖరం బాబు నవ్వు చూడాల్సిందే! చెబితే అర్థంకాదు. అబ్బాయి పెళ్లి చేసుకోడేమోనని ఒకటే బెంగ పెట్టుకొనేది అమ్మగారు. అలాంటి శేఖరంబాబు – ఈ ఉగాది మహిమ ఏమిటోగాని – ఒక యింటివాడయ్యాడు. పెళ్లి కూతుర్ని చూశాక అందరికీ ఆశ్చర్యమేసింది. అంత అందమయిన చిలకలాంటి పిల్లకోసమా యిన్నాళ్లు ఆగాడనుకొన్నాం. వాళ్లిద్దరూ మా యింటికి ఎప్పుడయినా రారా, మాట్లాడుకోరా

– మాట్లాడుకొంటే వినాలని ఎదురు చూసేవాడిని. ఓ రోజు రానే వచ్చారు. కాని ఆశ్చర్యం! వాళ్ళు మాట్లాడిన భాష మాకర్థంకాలేదు. ఈ కుటుంబమంతా నేర్చుకున్న భాష, నాకు తెలిసిన భాషలో వాళ్ళు మాట్లాడుకోవడం లేదు. నాకేం అర్థం కాలేదు. ఏమీ తెలీక వింతగా శేఖరంబాబునీ, అమ్మాయిగారినీ చూస్తుండిపోయాను.

అన్నీ చూడడమేగాని, చెప్పడం నేర్పలేదు అమ్మ. తెలుసుకోవడమేగాని, తెలియజెప్పడం మా పని కాదనేది. ఇవ్వడమేగాని పుచ్చుకోవడం ధర్మంకాదనేది. ఆ ఔన్నత్యమే అమ్మని అంత ఉన్నతురాల్ని చేసింది. ఎప్పుడూ చిరునవ్వు నవ్వుతూ పచ్చగా కనిపించే ఆమెను చూస్తూ నేను ఏ స్వల్పమో నేర్చుకోగలిగాను. ఆ స్వల్పమే నన్నింతవాడిని చేసింది.

వేసవికాలం వచ్చిందంటే మా రెండిళ్ళకీ హడావుడే. వేసవికాలం రాకముందునుంచీ మా కుటుంబంమీద ఓ కన్ను వేసి ఉంచుతారు పిల్లా పాపా అంతాను. మేం చిరునవ్వు నవ్వుతూ వాళ్లని ఆహ్వానిస్తూ ఉంటాం. వేసవికాలం బాగా ముదిరాక ఆ యింటికి సరిపడే మామిడిపళ్లని యివ్వడం మా బాధ్యత. వీలయినంత తియ్యటి మామిడిపళ్ళని తీయించి యిస్తుంది అమ్మ. అప్పుడు అమ్మ ముఖంలో గర్వం చూడాలి.

ఈ ఉగాదికి చాలా ప్రత్యేకతలున్నాయని పదేపదే గుర్తుచేసుకోసాగింది అమ్మ. ఆ యింట్లో వాళ్ళంతా జీవితాలని ఒక మార్గం పట్టించుకున్నారు. అందరూ ఓ యింటి వాళ్ళయ్యారు. పిల్లా పాపాతో సుఖంగా ఉన్నారు. ఇక పెదబాబుగారి బాధ్యతలు తీరిపోయాయి. ఈ తరం చేతులు కడుక్కొని ముందు తరానికి చార్జీ అప్పజెప్పేసింది. ఆయన ఉద్యోగం నుంచి రిటైరయి చుట్ట కాల్చుకొంటూ తీరిగ్గా పెరట్లోకి వచ్చి కుర్చీ వేసుకు కూర్చొంటే కన్నకొడుకుని చూసినట్టు ఆయన్ని చూసుకు మురిసిపోతుంది అమ్మ. అంత ఆప్యాయత, అనుభూతి మాలో ఎక్కడివా అని ఆశ్చర్యమేస్తుంది ఆ క్షణంలో ఆమెను గమనిస్తూంటే.

ఈ ఉగాదికి నాకు ప్రత్యేకమయిన అర్హత. నేనూ పెద్దవాడినయాను, అమ్మగారే స్వంతంగా వచ్చి నన్ను ఏరికోరి మరీ యింట్లోకి తీసుకెళ్ళారు యీసారి. ఎప్పుడూ యిక్కడ నుంచి చూసి ఆనందించడమేగాని, లోపలికి వెళ్ళనివ్వలేదు అమ్మ. ఎప్పుడన్నా అడిగితే "వాళ్ళు పిలుస్తారమ్మా. అప్పుడే నువ్వు వెళ్ళాలి" అనేది నవ్వుతూ. కాని ఆ రోజు ఆ యింట్లో పదిమందిలో నేనూ ఒకడినయాను. వాళ్లతో చిరునవ్వు నవ్వాను. ఆటలాడాను. కన్నుల పండగగా వారి వైభోగం చూశాను. ఎంత ఉత్సాహం! ఎంత ఆనందం! రోజంతా అలానే గడిచింది. సాయంకాలమయేసరికి అంతా అలసిపోయాం. ఎప్పుడూ తెలియని ఉత్సాహమేమో, ఆ అనుభవానికి సాయంకాలమయేసరికి సొమ్మసిల్లి పోయాను. మొదట నా స్థితిని గమనించింది బాబ్జీ. నన్ను చూసి దగ్గరికి వచ్చాడు. పలకరించాడు. కన్నెత్తే ఓపిక కూడా లేకపోయింది నాకు. ఎండకి మరీ ఒసిలిపోయాను. నన్ను తీసుకొచ్చి మా అమ్మకి అప్పగించి వెళ్ళిపోయాడు.

నన్ను చూసి అమ్మ దయగా పలకరించింది.

"బాగా అలసి పోయావా చిన్నా?" అని వెన్ను తట్టింది. ఆమె పలకరింత చల్లగాలిలాగ సోకింది నన్ను. నేనింకా దిగులుగా ఉండడం చూసి నెమ్మదిగా నాతో అంది. "బాధపడకు చిన్నా. మనమంతా – ఇవాళా రేపూ, ఎప్పుడూ – చెయ్యవలసిన బాధ్యత చేశావు నువ్వు – మన కిక్కడో స్థానం కల్పించి, తమంత వాళ్ళని చేసిన వాళ్ళకు సేవచేసే దృష్టిని మనం మరిచిపోకూడదు. మరిచిపోతే మన ఉనికి పరమార్ధమే నశిస్తుంది. ఇవ్వగలగడమే మన శక్తి. మనకి బాధ్యతలే ఉంటాయి. అందుకనే యిచ్చేవాడు ధన్యుడు. ఇవ్వడంలో ఎంత ఆనందం ఉందో యిప్పుడయినా అర్ధమయిందా చిన్నా?" – అంది.

అమ్మను చూశాను. పచ్చగా, నిండుగా చిరునవ్వుతో మాతృత్వంలోని పరిపూర్ణతకు మూర్తి కట్టినట్టున్న అమ్మని చూశాను. "అమ్మా" అన్నాను ఉద్వేగంగా.

"చూశావా? నువ్వు చేసిన మంచిపనికి సంతోషిస్తున్నావు. అదే మన తృప్తి. నీ ముఖం ఎలా వెలుగులోందో చూడు" అని చల్లగా నన్ను బుజ్జగించింది.

అమ్మ ఒడిలో ప్రశాంతంగా ప్రతిఫలం ఆశించని నిద్ర పోయాను – మళ్ళీ మేలుకొనే దృష్టీ, కోరికా లేకుండా.

నిద్ర పోయే ముందు – అవును – నా పేరు చెప్పలేదు కదూ మీకు?

నేను – నేను – మామిడి కొమ్మను. అవును, మామిడి కొమ్మనే. పరహితమే ఊపిరిగా పెంచిన ఆ పచ్చని పెద్ద ముత్తయిదువ – అవును – ఆ పూచిన మామిడి చెట్టే – మా అమ్మ. ఆమె శరీరంలో అంతర్భాగాన్ని, ఆమె ఒడిలో అందంగా పెరిగిన మామిడికొమ్మను. అదే నేను.

---